


నిప్పులు చెరుగుతూ నింగిలోకి..



ప్రయోగంలో రెండో దశ



మూడో దశ



నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం



ప్రయోగాన్ని వీక్షిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

గఘన విజయం

- పీఎస్ఎల్వీ-సీ 59 ప్రయోగ విజయంతో షార్‌లో సంబరాలు
- వాణిజ్యపరమైన ప్రయోగాల్లో మరోసారి సత్తా చాటిన ఇస్రో



విదేశీ శాస్త్రవేత్తలు

గురువారం సాయంత్రం 4.04 గంటలు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నిప్పులు చెరుగుతూ పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ నింగికెగిసింది. నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోయిన ప్రోబా-3 ఉపగ్రహం.. నిర్దేశిత కక్ష్యలోకి చేరింది. దీనికి పట్టిన సమయం 18.40 నిమిషాలు. అప్పటి వరకు ఉత్కంఠగా చూస్తున్న శాస్త్రవేత్తల్లో ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. సహచర శాస్త్రవేత్తలను ఇస్రో చైర్మన్ సోమనాథ్ అభినందించారు. ఈ విజయంతో వాణిజ్య పరమైన ప్రయోగాల్లో ఇస్రో మరోసారి సత్తా చాటింది. ఆదిత్య-ఎల్1 తరహాలోనే విదేశానికి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని సూర్యుడి బాహ్యవలయం కరోనాపై పరిశోధనలు చేసేందుకు విజయవంతంగా ఇస్రో ప్రయోగించింది. బుధవారం సాయంత్రం జరగాల్సిన ఈ ప్రయోగం ఉపగ్రహంలో సాంకేతిక లోపంతో చివరి గంటలో వాయిదా పడింది. దీనిని సరిచేసి గురువారం సాయంత్రం పీఎస్ఎల్వీ-సీ 59 వాహక నౌకను విజయవంతంగా ప్రయోగించారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

ఆకాశమే హద్దుగా..

వాణిజ్యపరమైన ప్రయోగాల్లో ఆకాశమే హద్దుగా ఇస్రో దూసుకెళ్తోంది. శ్రీహరికోట రాకెట్ కేంద్రం భూమధ్యరేఖకు 13 డిగ్రీల అక్షాంశంలో ఉండటంతో గ్రావిటీ పవర్ తక్కువగా ఉంటోంది. అందుకే ఇక్కడ వాణిజ్యపరమైన ప్రయోగాలకు తక్కువ ఖర్చవుతోంది. దీంతో చాలా దేశాలు న్యూస్పేస్ ఇండియాతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రెండు టన్నులకు మించి బరువున్న ఉపగ్రహాలను ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష కేంద్రాల నుంచి పంపుతున్నారు. అతిచిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ ద్వారా పంపడం ద్వారా వాణిజ్యపర ప్రయోగాలకు ఇస్రో కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇప్పటి దాకా 61 పీఎస్ఎల్వీ ప్రయోగాలు చేపట్టి అత్యధిక విదేశీ ఉపగ్రహాలు ప్రయోగించి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మరో 8 దేశాల ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ఎంవోయూ చేసుకొంది. దీంతో ఏడాదికి రూ.వెయ్యి కోట్లకు పైగా వాణిజ్యపరంగా ఆదయాన్ని ఆర్జిస్తోంది. తాజాగా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ 59 ద్వారా ప్రయోగించి మరో విజయాన్ని సొంతం చేసుకొంది.

పుత్తూరు-అత్తిపట్టు హార్బర్‌కు
కొత్త రైల్వేలైన్

- 189 హెక్టార్ల భూసేకరణ పనులకు అనుమతి

పుత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు నుంచి తమిళనాడులోని అత్తిపట్టుకు కొత్త రైల్వే మార్గం కోసం భూసేకరణకు రైల్వేశాఖ అనుమతిచ్చింది. 88 కిలోమీటర్ల దూరానికి 189 హెక్టార్లను సేకరించాల్సి వుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెన్నై రైల్వేజోన్‌లో పుత్తూరు-అత్తిపట్టుతో పాటు 185 కిలోమీటర్ల దిండివనం-తిరువణ్ణామల్లై, 36కిలోమీటర్ల మొరంపూర్-ధర్మపురి, 41 కిలోమీటర్ల మన్నార్‌గుడి-పట్టుకోట్లై, 52 కిలోమీటర్ల తంజావూరు- పట్టుకోట్లై లైన్ల భూసేకరణ పనులకు రైల్వే శాఖ అనుమతిచ్చింది. చెన్నై హార్బర్‌లో ఎగుమతులు, దిగుమతుల ఒత్తిడి ఎక్కువ కావడంతో ప్రత్యామ్నాయంగా అత్తిపట్టు హార్బర్‌ను కేంద్రం ఎంపిక చేసింది. బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుప ఖనిజాన్ని భవిష్యత్తులో అత్తిపట్టు హార్బర్‌కు మళ్లిస్తారు. ఈ కొత్త రైల్వే మార్గం నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా అట్టిపట్టుకు చేరుతుంది. ఇప్పటివరకూ ఈ ప్రాంత ప్రజలు పుత్తూరు స్టేషనుకు చేరుకుని రైలు ఎక్కుతున్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో
పోటు ఇన్‌చార్జి సస్పెన్షన్

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ప్రసాదం తయారీ పోటులో గోల్‌మాల్ జరిగినట్లు ఈవో బాపిరెడ్డి గుర్తించారు. ఇన్‌ఛార్జిగా పనిచేసే జూనియర్ అసిస్టెంట్ సురేష్‌రెడ్డిని సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోటులో జిలేబీ, లడ్డూ, వడతో పాటు పులిహోర ప్రసాదాలను తయారు చేసి కౌంటర్లకు తరలిస్తుంటారు. పులిహోర అన్నంతో తయారు చేసే పదార్థం కావడంతో బియ్యం ఉడికిన తరువాత కొంత బరువు పెరుగుతుంది. స్టోర్ నుంచి కొలత ప్రకారం స్వీకరించిన పదార్థాల ప్రకారం అదే లెక్కతో ప్రసాదాల కౌంటర్‌కు తరలించాలి. గురువారం ఈవో బాపిరెడ్డి పోటును తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉన్న సరుకు, రిజిస్టర్‌లో నమోదుకు తేడాలను గుర్తించారు. పోటు నుంచి కౌంటర్‌కు తరలించిన పులిహోర మోతాదులో పెద్ద ఎత్తున వ్యత్యాసం ఉన్నట్లు ఆయన ఆధారాలతో పట్టుకున్నారు. పోటు ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సురేష్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు. కాగా, ప్రసాదాల తయారీనుంచి కౌంటర్లలో విక్రయాల వరకు చాలామంది కుమ్మక్కు అయితేనే ఈ అక్రమం జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీని వెనుక అసలు పాత్రధారులు, సూత్రధారులు ఎవరన్నది లోతుగా దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాల్సి ఉంది.

తిరుపతి నుంచి సింగపూర్‌కు..

- నేడు అంతర్జాతీయ విమాన సర్వీసు ట్రయల్ రన్

రేణిగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులను ప్రారంభించడానికి సన్నాహాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 5గంటలకు తిరుపతి నుంచి సింగపూర్‌కు మొదటి అంతర్జాతీయ విమాన సర్వీసు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్టు విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు చెప్పారు. లక్స్ ఏవియేషన్ సాన్ మారినో జీఎల్ఈఎక్స్ విమానం ఒక ప్రయాణికుడు, నలుగురు సిబ్బందితో ఉదయం బయలు దేరుతుందన్నారు.





పోలీసులకు చిక్కిన గంజాయి బ్యాచ్

- 17 మంది అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు
- 32 కిలోలు స్వాధీనం



శ్రీకాళహస్తి పోలీసులు పట్టుకున్న గంజాయిని చూపుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను శ్రీకాళహస్తి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 32 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. ఈ వివరాలను గురువారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. వెంకటగిరికి చెందిన సాయిసందీప్, వెల్లంపాలెంకు చెందిన పి.జశ్వంత్, శ్రీకాళహస్తికి చెందిన గాది గణేష్, షేక్ నసీమ్, ఎలిరి హేమంత్, కోటంబేటి రాజా, పెనమల రాజు, బత్తిని కుమార్‌రాజా, ఆవల ఆకాష్, కారణి సాయికుమార్, కుప్పం శశి, శివ, చెరుకుట్టి వంశీ, ముత్తరాశిపాలెంకు చెందిన ఇసకమట్ల మనోజ్‌కుమార్, జెట్టిపాళేనికి చెందిన కుంచాల నాగరాజు, పాడేరు జిల్లా అరకువాసి సొంగుల అనంతరాము, తుమ్మలగుంటలో ఉంటున్న తేజ ముఠాగా ఏర్పడ్డారు. సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి రవాణాకు ప్రయత్నించారు. వీరికి అరకుకు చెందిన అనంతరాముతో పరిచయాలు ఏర్పడ్డాయి. కొన్నేళ్లుగా అరకు, పాడేరు నుంచి రైళ్లు, ట్రాన్స్‌పోర్టు వాహనాల ద్వారా జిల్లాకు గంజాయి తెచ్చేవారు. శ్రీకాళహస్తి కేంద్రంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాలకు తరలించి.. అక్కడ పొడి చేసి చిన్న, చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నారు. కొన్నేళ్లుగా వీరి కదలికలపై శ్రీకాళహస్తి పోలీసులు నిఘా పెట్టారు. శ్రీకాళహస్తి, తిరుపతి అడ్డాగా పలు రాష్ట్రాలకు గంజాయి అక్రమంగా తరలిస్తున్న 17 మందిని గుర్తించారు. వీరిని పట్టుకునేందుకు జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు గోపి, వెంకటేష్, ఎం.రవినాయక్, తిమ్మయ్య, ఎస్‌ఐ సుధాకరరెడ్డి, సిబ్బంది కలసి వలపన్నారు. శ్రీకాళహస్తిలోని బృందమ్మకాలనీ, పనసకోనమండపం, తొట్టంబేడు పరిధిలోని స్వర్ణముఖి బ్రిడ్జి కింద బ్యాచ్‌లుగా ఉన్న 17 మందిని పట్టుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అశ్వవాహనంపై అఖిలాండనాయకి

గురువారం రాత్రి ఏడు గంటలకు అశ్వవాహనంపై మహారాణి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. గజతురగ, వృషభాలు ముందు నడవగా, మంగళవాయిద్యాలు, భజన బృందాలు, భక్తుల కోలాటాలు, జీయ్యర్ స్వాముల పరివారం ప్రబంధ పారాయణం నడుమ అశ్వవాహనంపై అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. హరి పట్టపురాణి అలమేలు మంగమ్మను అశ్వవాహనంపై దర్శించుకుంటే కలిదోషాలు తొలగుతాయనేది భక్తుల నమ్మకం. దీంతో ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. - తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానము

శ్రీకాళహస్తి :: తిరుపతి జిల్లా - 517 644

బహిరంగ వేలము ప్రకటన

ఆర్.సి.నెం.Rev 59-సి1/4/2024, తేది: 04-12-2024

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం హక్కు భుక్తములలో గల ఈ క్రింది తెల్పిన గ్రామాలలో ఉన్న దేవస్థానం భూములను (3) సంవత్సరముల కాలమునకు సాగు చేసుకొనుటకు బహిరంగ వేలము నిర్వహించుట. ఆసక్తి గల రైతులు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలములో పాల్గొనవచ్చును.

తిరుపతి జిల్లా

వ. సం	గ్రామం పేరు	విస్తీర్ణం	ధరావత్తు డిపాజిట్	తేది & సమయము
1.	బోడిరెడ్డి కండ్రిగ (మహాదేవపురం)	ఎ.1.05సెం	రూ.2000/-	తేది:17-12-2024 ఉ: 10.00గం.
2.	సుబ్బనాయుడు కండ్రిగ గ్రామం (శ్రీకాళహస్తి మం)	ఎ.7.23సెం	రూ.10000/-	తేది:16-12-2024 ఉ: 10.00గం.
3.	బొక్కసంపాలెం	ఎ.1.02సెం	రూ.2000/-	తేది:16-12-2024 ఉ: 11.00 గం.
6.	చుక్కలనిడిగల్లు	ఎ.8.55సెం	రూ.10000/-	తేది:16-12-2024 ఉ: 12.30గం.
7	పాతగుంట	ఎ.3.72సెం	రూ. 5000/-	తేది:17-12-2024 మ: 3.00గం.
8	కాపుగున్నేరి గ్రామం	ఎ.2.29సెం ఎ.0.96సెం ఎ.0.49సెం	రూ. 5000/- రూ. 2000/- రూ. 1000/-	తేది:16-12-2024 మ: 3.00గం.

ఇతర వివరముల కొరకై సెల్ నెం. **70130 14433 / 99126 52553 / 98664 56141 / 99660 13456** ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి

నేడే పంచమి తీర్థం

- మధ్యాహ్నం 12.15 గంటలకు చక్రస్నానం
- తిరుచానూరుకు చేరుకున్న భక్తజనం

తిరుచానూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం పంచమితీర్థం జరగనుంది. మధ్యాహ్నం 12.15 గంటలకు అభిజిత్ లగ్నంలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించనున్నారు. ఆ తర్వాత భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించనున్నారు. దీనికోసం గురువారం రాత్రికే తమిళనాడు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుచానూరుకు చేరుకున్నారు. వీరందరినీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్‌కు తరలించారు. రాత్రి పదిన్నర గంటలకే ఈ హోల్డింగ్ పాయింట్ నిండిపోయింది. కొందరు క్యూలైన్లలో పడుకున్నారు. ఇలా ఏర్పాటు చేసిన మూడు హోల్డింగ్ పాయింట్లనుంచి భక్తులను శుక్రవారం ఉదయం 9 గంటలపైన పుష్కరిణిలోకి అనుమతించనున్నారు. పుష్కరిణి నుంచి వెలుపలికి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి వెళ్లడానికి ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ఒక గేటు వద్ద డీఎస్పీ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటూ తొక్కిసలాట లేకుండా చూసే బాధ్యతను పోలీసు యంత్రాంగం తీసుకుంది. చక్రస్నానం జరిగే ప్రాంతంలో భక్తులు దూసుకురాకుండా ఉండేందుకు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. వీవీఐపీలకు, వీఐపీలకు, టీటీడీ ఉద్యోగులకు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విలువైన ఆభరణాలు ధరించి రావద్దని భక్తులకు సూచించారు. ఉదయం అమ్మవారికి సారె ఊరేగింపు సందర్భంగా గజరాజులు బెదరకుండా సింధు జంక్షన్ నుంచి ఆలయ ముఖద్వారం వరకు రోడ్డు డివైడర్‌కు ఇనుప కంచె ఏర్పాటు చేశారు. భక్తులను ఒకే మార్గంలోనే అనుమతించనున్నారు. మరోవైపు గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం 4గంటల వరకు తిరుచానూరులోకి వాహనాలను నిషేధించారు.

హోల్డింగ్ పాయింట్లకు ఇలా..

పుత్తూరు వైపు నుంచి వచ్చే వారికి తిరుచానూరు గోశాల వద్ద, జడ్పీ ఉన్నత పాఠశాల.. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట వైపు నుంచి వచ్చే భక్తులు నవజీవన్ ఆస్పత్రి వద్ద హోల్డింగ్ పాయింట్లకు చేరుకోవాలి.

అమ్మవారి జన్మదినమే..

కార్తీకమాస శుక్లపక్ష పంచమి ఉత్తరాషాడ నక్షత్ర యుక్త అభిజిత్ లగ్నం శుక్రవారం రోజున పద్మావతిగా స్వర్ణకమలం మధ్యలో అమ్మవారు ఆవిర్భవించారని పురాణోక్తి. ఆ జన్మదినాన్ని పంచమి తీర్థంగా వ్యవహరిస్తారు. బ్రహ్మోత్సవాల్లో పంచమితీర్థం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చి పద్మసరోవరంలో స్నానాలు ఆచరిస్తారు.





చక్రస్నానం కోసం గురువారం రాత్రే తిరుచానూరుకు చేరుకుని హోల్డింగ్ పాయింట్‌లో సేదతీరుతున్న భక్తులు - పుష్కరిణిలోకి వెళ్లే క్యూలైన్లలో నిద్రిస్తున్న భక్తులు

120 సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో శుక్రవారం జరిగే పంచమి తీర్థానికి 120 సీసీ కెమెరాలు, ఆరు డ్రోన్లతో పోలీసులు నిఘా ఉంచారు. పుష్కరిణిలోని ప్రతి గేటు వద్ద సీసీ కెమెరా అమర్చారు. ఆకతాయిలు అల్లరి చేష్టలకు పాల్పడితే వెంటనే అదుపులోకి తీసుకుంటారు. చైన్ స్నాచింగ్‌లు, జేబు దొంగతనాలకు తావు లేకుండా చూస్తున్నారు. 22 గేట్ల ద్వారా పుష్కరిణిలోకి... వెలుపలకు భక్తులను అనుమతిస్తారు. ఒకేసారి 1500 మంది పుష్కరిణిలో స్నానం ఆచరించేలా చర్యలు తీసుకున్నారు. వైద్య శిబిరాలతో పాటు 108, టీటీడీ అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో దాదాపు 1400 మంది, టీటీడీ సెక్యూరిటీ మరో 600 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అమ్మవారి ఆలయం చుట్టూ తనిఖీ చేశారు. బందోబస్తు పర్యవేక్షించారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే

మ్యాంగో గార్డెన్, అర్బన్ హట్, పూడి క్రాస్, నారాయణాద్రి క్రాస్ రోడ్డు వద్ద పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసి, సూచిక బోర్డులు పెట్టారు. పోలీసులను నియమించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే వాహనాలను ఈ పార్కింగ్ ప్రదేశాల్లో ఉంచి భక్తులు నడుచుకుంటూ హోల్డింగ్ పాయింట్లకు చేరుకోవాలి.

హెచ్చరిక

ఇందు మూలముగా యావత్తు ప్రజానికానికి తెలియజేయడం ఏమనగా, మా కక్షిదారుడు అయిన ఎస్. ఖాదర్ భాషా, 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టుయందు O.S. 77/2024 అను దావా ఇ.మునిరత్నం నాయుడు వగైరాల పయిన రూ.5,21,89,182/- (అక్షరాలా ఐదు కోట్ల ఇరవై ఒక్క లక్షల ఎనభై తొమ్మిది వేల నూట ఎనభై రెండు రూపాయలు మాత్రమే) తిరిగి పొందుటకు గాను దావా వేసియున్నారు. సదరు దావా యందు I.A.No. 257/2024 అను పిటీషన్ వేసి, క్రింద కనపరచిన షెడ్యూల్ దాఖలా ఆస్తి ఎ. 1.03 1/2 సెంట్లు భూమిని జప్తు చేయమని కోరడం అయినది. కావున సదరు ఇ. మునిరత్నం నాయుడు వగైరాలతో క్రింద కనబరచిన షెడ్యూల్ ఆస్థి నిమిత్తం ఎటువంటి లావాదేవీలు జరిపిన చెల్లనేరవు మరియు అట్టి వారిపై మా కక్షిదారుడు తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు భాద్యులు అవుదురు.

షెడ్యూలు : తిరుపతి జిల్లా, తిరుపతి, చంద్రగిరి ఉపజిల్లా, తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లి గ్రామ పంచాయతి మరియు గ్రామ లెక్కదాఖలా 54, **S.No.224**, ప్రస్తుత ఆన్‌లైన్ **S.No.224/B** మొత్తం విస్తీర్ణం ఎ.1.03 1/2 సెంట్లులో వేయబడిన ప్లాట్ నెం.లు 1 నుండి 12 వరకు ఇందుకు హద్దులు. **తూర్పు :** రోడ్డు, **పడమర :** ఎ. చెంచయ్య వగైరాలు అమ్మిన భూమి, **దక్షిణం :** ఇ. ఆంజనేయుల నాయుడు వగైరాల భూమి, **ఉత్తరం :** ఇ. సర్వేనెంబర్‌లో మిగిలిన భూమి.

ప్లాటు కొలతలు : ప్లాట్ నెం. 1) 34.33 , 2) 35.41, 3) 36.28, 4) 30, 5) 46.77, 6) 48.54, 7) 50.20, 8) 51.66, 9) 52.70, 10) 53.125, 11) 54.58, 12) 93.75 మొత్తం విస్తీర్ణం : 587.345 అంకణాలు.

షెడ్యూలు బి : అయిటెమ్ నెం.1 : తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామలెక్కదాఖలా, చంద్రగిరి **SRO**, ఎ. 0.43 సెంట్లు, **S.No.** 171/1, **అయిటెమ్ నెం.2 :** తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామ లెక్కదాఖల, చంద్రగిరి **SRO**, ఎ. 1.45 సెంట్లు, **S.No.** 517/బి, **అయిటెమ్ నెం.3 :** తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామ లెక్కదాఖల, చంద్రగిరి **SRO**, ఎ. 0.52 సెంటు, **S.No.** 543/2.

ఇట్లు : **జి.శ్రీనివాసులు గౌడ్, జి.జ్యోత్స్న,**
న్యాయవాదులు, తిరుపతి. సెల్ : **99669 88228**

సమస్యల పరిష్కారానికే
రెవెన్యూ సదస్సులు


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు వెంకటరమణ

రామచంద్రాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 6, 7వ తేదీలలో సమస్యల పరిష్కారానికి నిర్వహించే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహశీల్దారు వెంటకరమణ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా రెవెన్యూ గ్రామాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలోడీటీ అన్వర్‌బాషా, ఆర్‌ఐ లక్ష్మీనారాయణ, సర్వేయర్లు రమేష్‌బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రసాయన ఎరువులను తగ్గించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రామచంద్రాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూమిని కాపాడుకుం దామని వ్యవసాయశాఖ అధికారిణి స్రవంతి కోరారు. కుప్పంబాదూరు రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం ప్రపంచ మట్టి దినోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విపరీతమైన రసాయనిక ఎరువులు వాడటంతో భూమి నిస్సారమవుతోందన్నారు. దీనిని తగ్గించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సూచించారు. ప్రతి పంటకు భూసార పరీక్షలు నిర్వహించి సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రామచంద్రాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు ఇజాజ్ అహ్మద్‌పై విద్యార్థులు దాడిచేయడంతో ఆయన మృతి చెందారు. దీంతో మండలంలోని కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎల్‌టీఏ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. ఇజాజ్ అహ్మద్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి తీవ్ర గాయాలు

పాకాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గాదంకి సమీపంలోని పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం చెక్కిరివాండ్లపల్లెకు చెందిన రాజేంద్ర ప్రసాద్ కుమార్తె వి.లహరి తిరుపతి శ్రీ పద్మావతి ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతోంది. గాదంకి ఎస్‌ఏఆర్‌ఎల్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తోంది. గురువారం ఉదయం ఎస్‌ఏఆర్‌ఎల్‌కు వెళ్లడానికి జాతీయ రహదారి దాటుతుండగా కారు ఢీకొంది. ప్రమాదంలో లహరికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారి అంబులెన్స్ సిబ్బంది లహరికి ప్రథమ చికిత్సలు అందించి చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. చంద్రగిరి జాతీయ రహదారిలో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 45 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే కాశిపెంట సమీపంలోని హెరిటేజ్ పార్లర్ వద్దనున్న ఫ్లైఓవర్‌పై అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని సుమారు 45 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


హెరిటేజ్ వద్ద


చంద్రగిరి ఫ్లైఓవర్ వద్ద

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని భవిత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, సహిత విద్య ఉపాధ్యాయులు శ్యామలదేవి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వివిధ వేషధారణలో ప్రత్యేక ప్రతిభావంతులు

మెడికల్ షాపుల తనిఖీ

ఎర్రావారిపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు మెడికల్ షాపులను గురువారం తిరుపతి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రూప తనిఖీ చేశారు. మండలం కేంద్రంలో మూడు మెడికల్ షాపులతోపాటు క్రాస్‌లో ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను పరిశీలించారు. మందులు కొనుగోలు రికార్డులు లేకపోవడంతో ఆర్‌ఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి రికార్డులు, బిల్లులు తిరుపతి కార్యాలయానికి చేర్చాలని ఆదేశించారు.

అర్జీలన్నిటికీ జవాబుదారీతనం



చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని తహశీల్దారు శివరామ సుబ్బయ్య కోరారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడు తూ రెవెన్యూ సదస్సులో బాధితులు ఇచ్చిన అర్జీలకు జవాబు దారీతనం ఉంటుందని.. ప్రతి భూ సమస్య పరిష్కరించు కోవచ్చని తెలిపారు. అలాగే అర్జీతో పాటు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్ ఉండాలన్నారు. సర్టిఫికెట్లకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన అర్జీలకు 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భాకరాపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు జనార్దన్‌రాజు తెలిపారు. 6న దేవరకొండ (చిట్టేచర్ల సచివాలయం), 7న ఉదయం చిట్టేచర్ల, మధ్యాహ్నం దీన్‌దార్లపల్లె, 10న భాకరాపేట, 11న ఎగవూరు, దిగవూరు, 12న చట్టేవారిపాళెం, 13న ఉదయం తిప్పిరెడ్డిగారిపల్లె, మధ్యాహ్నం జంగావాండ్లపల్లె, 17న ఉదయం నెల్లుట్లవారిపల్లె, మధ్యాహ్నం కోటబైలు, 18న రంగన్నగారిగడ్డ, 19న చిన్నగొట్టిగల్లు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాలలో సచివాలయాల వద్ద సదస్సులు ఏర్పాటు చేశామని, రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు.

'బీజేపీని బలోపేతం చేద్దాం'


బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చంద్రగిరిలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయాలని.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సాధారణ పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం యాదవ్, గాలి పుష్పలత, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌బాబు, నాయకులు మునిగంగిరెడ్డి, చైతన్యరెడ్డి, ఈశ్వర్, జనార్ధన్‌నాయుడు, తిలక్‌యాదవ్, దొరస్వామి, నరేష్‌నాయుడు, వెంకట శివారెడ్డి, విజయ్‌కుమార్, మునెయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు


సమావేశంలో మాట్లాడుతున్న డీఈ సురేష్

భాకరాపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఇరిగేషన్ డీఈ సురేష్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల సాగునీటి ఎన్నికల పోలింగ్ సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొట్టిగుంటి చెరువు, పడమాలమ్మ చెరువు, జాండ్రపేట చెరువు, ఎర్రావారిపాళెం మండలంలో అయ్యప్పరెడ్డి చెరువు, నల్లసముద్రం, సిద్దలగండి చెరువులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా, చేతులు ఎత్తడం, బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు ప్రలోభాలకు గురికాకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, ఎర్రావారిపాళెం తహశీల్దారు పరమేశ్వర స్వామి, ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, ఏఈలు గిరీశ్ కుమార్, ఎత్తిరాజులు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


కందులవారిపల్లెలో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ వర్తించేలా చర్యలు చేపడుతు న్నామని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశా లతో జిల్లా అధికారులు చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్న రామాపురం పంచాయతీలలో గురువారం పర్య టించారు. ఇటీవల ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నారావారిపల్లె పర్యటనకు వచ్చినపుడు మూడు పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసి, అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేలు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కావాల్సిన మౌలిక సదుపా యాలు, చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. మహి ళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా గ్రామాల్లోని సమస్యలు, జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు ఆరా తీశారు. ఏనుగుల, కోతులు, పందుల బెడద నుంచి రక్షించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎ.రంగం పేటలోని ఉన్నత పాఠశాలను కార్పొరేట్ పాఠశాలగా తీర్చిదిద్దడానికి శ్రీసిటీ దత్తతకు తీసుకోవడానికి సంబంధించిన అధికా రులు పాఠశాలను సందర్శిం చారు. ప్రతి ఇంటికీ సోలార్ సిస్టం ఏర్పాటు చేసి 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పం చులు బొబ్బా లక్ష్మిగిరినాయుడు, రాగిని, ఉపసర్పంచ్ రాకేష్ చౌదరి, టీడీపీ నాయకులు నిరంజన్ నాయుడు, అంకులయ్య, సునీల్, అధికారులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి శ్రీవారి సారె


అమ్మవారి రథాన్ని లాగుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు తదితరులు


గురువారం రాత్రి జరిగిన పద్మావతి అమ్మవారి అశ్వవాహన సేవలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుచానూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచమి తీర్థం సందర్భంగా తన దేవేరి పద్మావతి అమ్మవారికి తిరుమల నుంచి శ్రీవారి తరపున సారె అందనుంది. ఇందులో భాగంగా శుక్రవారం వేకువజామున తిరుమలలో జీయర్ స్వాముల సమక్షంలో పట్టుచీర, పసుపు, చందనం, కుంకుమ, బంగారు తిరు ఆభరణాలు, అన్నప్రసాదాలు తదితర సారెతో టీటీడీ ఈవో శ్యామలరావు, ఏకాంగులు, అర్చకులు, పరిచారకులు కాలిమార్గాన అలిపిరికి చేరుకుంటారు. అక్కడ వారికి అమ్మవారి ప్రతినిధిగా జేఈవో వీరబ్రహ్మం ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఏనుగు అంబారిపై ఊరేగింపుగా సారె బయలుదేరుతుంది. కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండు, లక్ష్మీపురం మీదుగా తిరుచానూరు ముఖద్వారం వద్ద నున్న పసుపు మండపానికి తీసుకొస్తారు. సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించి తిరువీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుస్తారు. అక్కడి నుంచి పంచమీ తీర్థం మండపానికి తీసుకొచ్చి సారెలోని పసుపు, చందనం తదితరాలతో ఉత్సవమూర్తి, చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ తర్వాత చక్ర స్నానం నిర్వహిస్తారు.

నేడు ధ్వజావరోహణం

శుక్రవారం రాత్రి జరిగే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. రాత్రి బంగారు తిరుచ్చి అమ్మవారు తిరువీధుల్లో విహరిస్తారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా అర్చకులు ధ్వజస్తంభంపై ఉన్న గజ చిత్రపటాన్ని అవరోహణం చేస్తారు.

రేపు పుష్పయాగం

కాగా, శనివారం సాయంత్రం అమ్మవారికి పుష్పయాగం నిర్వహించనున్నారు. భక్తులు టికెట్లు కొనుగోలు చేసి పుష్పయాగంలో పాల్గొనవచ్చు.

భీమవరంలో ఏనుగుల బీభత్సం


ఏనుగులు ధ్వంసం చేసిన పంటలు

చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట అటవీ ప్రాంతం నుంచి చంద్రగిరి మండలంలోని భీమవరం, యల్లంపల్లి, కూచువారిపల్లె గ్రామాల్లో గురువారం తెల్లవారు జామున సుమారు 15 ఏనుగులు పంట పొలాల్లో బీభత్సం సృష్టించాయి. దీంతో సుమారు 10 మంది రైతులకు చెందిన వరి, మామిడి, అరటి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. రైతులు చంద్రకళ, కృష్ణమనాయుడు, కృష్ణమూర్తిరెడ్డి, ప్రసాద్, మునిరత్నంనాయుడు రైతుల పొలాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. మరో ఐదుగురికి చెందిన ఫెన్సింగ్ ధ్వంసం చేశాయి. గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఏనుగులు మూడు బృందాలుగా అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయాయి. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ధ్వంసం అయిన పంటలను పరిశీలించారు. ఏనుగుల జాడ కోసం గాలింపు చేపట్టారు. ఎఫ్‌ఎస్వో అనిత ఆధ్వర్యంలో రాత్రి ధ్వంసం అయిన పంట పొలాల సమీపంలో బాణా సంచా కాలుస్తూ ఏనుగుల జాడ కోసం నిఘా ఏర్పాటు చేశారు. ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన పంటలకు అటవీశాఖ తగిన నష్టపరిహారం చెల్లిస్తామని అటవీ అధికారులు తెలిపారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి


దోబీఘాట్‌ని పరిశీలిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రప్రదేశ్): రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని రజక కార్పొరేషన్ డైరెక్టర్లు అన్నాసముద్రం మధు, కరాటే చంద్ర తెలిపారు. తిరుపతి రూరల్ మండలం 150 బైపాస్ రోడ్డులోని దోబీఘాట్ వద్ద గురువారం వినాయక రజక సేవా సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై దోబీఘాట్‌ని సందర్శించారు. చంద్రగిరి నియోజకవర్గంలో రజకులకు ఏ సమస్య వచ్చినా ఐక్యంగా పరిష్కరించుకుందామని తెలిపారు. కాగా సంఘ ఆధ్వర్యంలో డైరెక్టర్లను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. రజక జనసేవాసంఘ అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, రజకసాధికార కమిటీ ప్రతినిధులు శంకర్, అశోక్, సుధాకర్, యశోద, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, మనోహర్, చందు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల స్థానికుల సమస్యను పరిష్కరించండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన కార్యకర్తలు

తిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల స్థానికుల సమస్యలు పరిష్కరించాలంటూ జనసేన పార్టీ కార్యకర్తలు గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. తిరుమల సచివాలయానికి నూతన కోడ్, నూతన రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డు జారీ వంటి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జీవన్‌రాయల్, బద్రి సుధా రాయల్, మంజు, వంశీ ఉన్నారు.

చెంగయ్యపై చర్యలు తీసుకోండి

- ఎస్వీయూ అధికారులకు బీజేపీ వినతి


వీసీ అప్పారావుతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో అన్య మత ప్రచారానికి పాల్పడిన ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ చెంగయ్యపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత, టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కోరారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని కలిసి గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ప్రొఫెసర్ చెంగయ్యను సస్పెండ్ చేయకపోతే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పొనగంటి భాస్కర్, పెనుబాల చంద్ర, శ్రీహరి, గవ్వల అశోక్, కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నాగోతు హరికృష్ణ, నాదముని, రావూరి అశోక్, శీను పాల్గొన్నారు.

ఏపీ టూరిజం హోటల్ నిర్మాణానికి స్థల పరిశీలన


ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం హోటల్ నిర్మాణానికి గురువారం చంద్రగిరి జాతీయ రహదారి సమీపంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలోని సర్వే నంబర్ 1,117లోని 7 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం ఈఈ సుబ్రహ్మణ్యంరాజు, డీఈఈ శ్రీనివాసులరెడ్డి, తహశీల్దారు శివరామసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ


పాకాలలో పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాకాలలో రామకృష్ణా డీలక్స్ సినిమా థియేటర్ వద్ద జరిగిన టీడీపీ నేతల గొడవలో గాయపడిన బాధితులను చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గురువారం పరామర్శించారు. భరోసా కల్పించి ఆర్థిక సాయం అందించారు. పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా పాకాలలో టీడీపీ, వైసీపీ మధ్య ఘర్షణ జరిగింది. దీంతో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మున్నీర్‌బాయ్, ఆయన కుమారుడు అఫ్రీద్‌లను పరామర్శించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన సంతోష్ కుటుంబ సభ్యులు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. చెక్కును అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శ నానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని గురువారం టీటీడీ బోర్డు సభ్యుడు బి.మహేందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, జనసేన నాయకులు కావలి శివకుమార్, తోట గణేష్, జ్యోతిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్

● 18 ఎర్రచందనం దుంగల స్వాధీనం


స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా గిద్దలూరు అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. కడప సబ్ కంట్రోల్ ఆర్‌ఎస్‌ఐ పి.నరేష్ బృందం, అటవీ శాఖ అధికారులు లక్ష్మీనాయక్, జమాల్ వల్లిలతో కలిసి గిద్దలూరు డివిజన్ చింతలపల్లె అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. కనుమబావి రస్తా వద్ద కొంత మంది అనుమానాస్పదంగా కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా ఇద్దరు దొరికారు. వారు ప్రకాశం జిల్లావాసులుగా గుర్తించారు. సమీపంలో పరిశీలించగా 18 ఎర్రచందనం దుంగలు దొరికాయి. దుంగలను, స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామవేదంలో సమస్త వేద సారాంశం

వేద వర్సిటీ వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సామవేదంలో సమస్త వేదాల సారాంశం ఇమిడి ఉందని వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి పేర్కొన్నారు. సామవేద విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. చతుర్వేదాలలో సామవేదం ఒకటన్నారు. సామం అంటే మధురమైందనే అర్థం ఉందన్నారు. వేద వ్యాసుడు జైమిని మహర్షికి బోధించినట్టుగా ఉందన్నారు. వేదాల్లోని ప్రాముఖ్యతలోనూ, పవిత్రతలోనూ, సాహిత్య విలువల్లోనూ సామ వేదానికి ప్రత్యేకత ఉందని అభిప్రాయపడ్డారు. సామవేదంలోని విలువల సారాన్ని సమాజం అనుసరించాలని సూచించారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ సామ వేదంలోని మంచిని ఈ తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. సామవేద ఆచార్యులు గిరిజాప్రసాద్ మాట్లాడుతూ సామవేదాన్ని అనేక దృక్కోణాల నుంచి నేటి సమాజానికి మేలు చేసే లక్ష్యంతో పరిశోధించాల్సిన అవసరం ఉందన్నారు. కేరళకు చెందిన శివశంకర నంబుద్రి మాట్లాడుతూ విద్యార్థులు సామ వేదాన్ని నిశితంగా చదివి అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి, మీడియా కో-ఆర్డినేటర్ డాక్టర్ బ్రాహ్మాచార్యులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న రాణీసదాశివమూర్తి

తిరుపతిలో మరో 'స్మార్ట్' స్పోర్ట్స్ కాంప్లెక్స్

తిరుపతి, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి ప్రజలకు మరో స్మార్ట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటివరకు ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ సమీపంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ మాత్రమే ఉండేది. ఇప్పుడు నగర నడిబొడ్డున అధునాతన హంగులతో ఇండోర్ స్టేడియం గురువారం ప్రారంభమైంది. స్మార్ట్ సిటీ నిధులతో ఇందిరా మైదానంలో నిర్మించిన ఇండోర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, శాప్ చైర్మన్ రవినాయుడు, మేయర్ శిరీష తదితరులతో కలిసి గురువారం కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ.8.8కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మించినట్లు చెప్పారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, షటిల్ వంటి క్రీడలతో పాటు ఇండోర్ క్రీడలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా కూటమి ప్రభుత్వం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. రవినాయుడు మాట్లాడుతూ ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న సంకల్పంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ నగరంలో క్రీడాకారులు ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకుని తిరుపతి ఖ్యాతిని దశదిశలా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ ఎమ్మెల్యేతో కలిసి వాలీబాల్, టెన్నిస్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ, ఊకా విజయకుమార్, పుష్పావతి, మహేష్ యాదవ్, పాటకం వెంకటేష్, ఆముదాల తులసీరాం, జనసేన నేతలు పొలకల మల్లికార్జున్, సుభాషిణి, వినోద్ రాయల్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, అనిల్, కల్పన, అనిత, రుద్రరాజు శ్రీదేవి, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, స్మార్ట్ సిటీ మేనేజర్ చంద్రమౌళి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఇంజనీర్లు చంద్రశేఖర్, తులసీకుమార్, ఆర్వో సేతుమాధవ్ పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో నాయకులు, అధికారులు

27 నుంచి పవన్ కల్యాణ్ జాతీయ నాటకోత్సవాలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీ నుంచి తిరుపతిలో మూడు రోజుల పాటు పవన్ కల్యాణ్ పేరుతో జాతీయ నాటకోత్సవాలు నిర్వహించనున్నారు. మహతి కళాక్షేత్రం దీనికి వేదిక కానుంది. సుబ్బరాజు నాటక కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటకోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నిర్వాహకుడు కోనేటి సుబ్బరాజు మాట్లాడుతూ నాటక పోటీలకు 61 మంది దరఖాస్తు చేసుకోగా, 8 నాటకాలను ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజు కళా పరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు, కార్యదర్శి గోపాలరావు, సంయుక్త కార్యదర్శులు జింకా నారాయణస్వామి, పి.మునిసుబ్రమణ్యం, కోశాధికారి మేకల గంగయ్య పాల్గొన్నారు.

కార్తీక బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక వైభవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతిలోని వివిధ కళా వేదికలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. తిరుచానూరు ఆస్థాన మండపంలో మ్యూజిక్ కాలేజీ ఆధ్వర్యంలో మంగళధ్వని, వేద అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో చతుర్వేద పారాయణం నిర్వహించారు. తెనాలికి చెందిన విశ్వనాథశర్మ ధార్మికోపన్యాసం, విశాఖకు చెందిన మాధవి బృందం భక్తి సంగీత కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుపతికి చెందిన నాగేశ్వరనాయుడు బృందం అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. మహతి కళాక్షేత్రంలో శ్రీహరి మహాలింగేశ్వర నృత్య రూపకం ప్రదర్శించారు. అన్నమాచార్య కళా మందిరంలో మ్యూజిక్ కాలేజీకి చెందిన జ్ఞాన ప్రసూన వీణ వాయిద్యం, ఇతర కళాకారుల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. రామచంద్ర పుష్కరిణి వద్ద కర్నూలుకు చెందిన గంగాధరం కూచిపూడి నృత్యం అలరించింది. శిల్పారామంలో విజయవాడకు చెందిన పార్థసారథి కూచిపూడి నృత్య ప్రదర్శన నేత్ర పర్వంగా సాగింది. కళాకారులను టీటీడీ పక్షాన సత్కరించారు.

శబరిమలైకు 20 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శబరిమలై భక్తుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని మూడు ప్రాంతాల నుంచి రేణిగుంట మీదుగా 28 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మౌలాలి-కొల్లం మధ్య 12 సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు.

- ఈ నెల 11, 18, 25 తేదీల్లో మౌలాలిలో రైలు(07193) సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చెంగనచ్చేరి, తిరువళ్ల, చెంగనూరు మీదుగా మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు కొల్లంకు చేరుకుంటాయి.
- రైలు(07194) కొల్లంలో 13, 20, 27 తేదీల్లో (ప్రతి శుక్రవారం) వేకువజామున 2.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మౌలాలికి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు చేరుకుంటాయి.
- మరో ప్రత్యేక రైలు(07149) ఈ నెల 14, 21, 28 తేదీల్లో మౌలాలిలో సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడుకుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొడనూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చెంగనచ్చేరి, తిరువళ్ల, చెంగనూరు, కాయాకుళానికి మరుసటి రోజు రాత్రి 11.30 గంటలకు చేరుకుంటాయి.
- ఈ ప్రత్యేక రైలు(07150) తిరిగి ఈనెల 16, 23, 30 తేదీల్లో కాయాకుళంలో వేకువజాము 2.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు చేరుకుంటాయి.

కాచిగూడ-కొట్టాయం మధ్య 8 సర్వీసులు

- ప్రత్యేక రైలు(07151) కాచిగూడలో జనవరి 2, 9, 16, 23 తేదీల్లో మధ్యాహ్నం 3.40 గంటలకు బయలుదేరి షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్, కర్నూల్‌సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొడనూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్ మీదుగా మరుసటి రోజు సాయంత్రం 6.50 గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి.
- ఈ ప్రత్యేక రైలు (07172) కొట్టాయంలో తిరిగి జనవరి 3, 10, 17, 24 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు రాత్రి 11.40 గంటలకు కాచిగూడకు చేరుకుంటాయి.

షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం స్వాధీనం

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస క్రీడా సముదాయంలోని షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం శాప్ స్వాధీనమైంది. గత వైసీపీ హయాంలో లీజు ప్రాతిపదికన 2022 డిసెంబరు నుంచి రెండేళ్ల పాటు కేటాయించింది. లీజు దారుడు నెలకు రూ.1.02 లక్షలు అద్దె చెల్లిస్తూ కార్యకలాపాలు కొనసాగించారు. 2024 నవంబరు నెలాఖరుతో లీజుకాల పరిమితి ముగిసింది. ఈ క్రమంలో లీజు ప్రక్రియను రద్దు చేసి, శాప్‌కు స్వాధీనం చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీ చేయాలని లీజు దారుడిని ఆదేశించారు.

రూ.50లక్షలతో ప్రజారోగ్య అదనపు భవనం


భవన నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

తిరుపతి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంగళంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం విస్తరణలో భాగంగా రూ. 50లక్షలతో అదనపు భవన నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి ఈ ఏడాది జనవరిలోనే నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆ తర్వాత ఎన్నికలు రావడంతో అమలుకు నోచలేదు. కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఆర్ అండ్ బీ అధికారులు ఇటీవల స్థలాన్ని పరిశీలించారు. 1,535 చదరపు అడుగుల విస్తీర్ణంలో రిసెప్షన్ సెంటర్, వెయిటింగ్ హాల్, కార్యాలయం, లేబొరేటరీ, స్టోర్‌రూమ్, టాయిలెట్లతో కలిపి అత్యాధునిక వైద్య సదుపాయాలతో భవన నిర్మాణం చేపట్టనున్నారు. త్వరలోనే భూమిపూజ చేయనున్నారు.

బర్డ్, స్విమ్స్ ఆస్పత్రులను ప్రజోపయోగంగా మార్చండి

తిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్, స్విమ్స్, ఆయుర్వేద ఆస్పత్రులను ప్రజోపయోగంగా తీర్చిదిద్దాలని, బర్డ్ ఆస్పత్రికి పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. ఈ మేరకు గురువారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో మురళి మర్యాద పూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు. బర్డ్‌కు డైరెక్టర్ లేకపోవడంతో పరిపాలన కుంటుపడిందని, అభివృద్ధి పనులు ఆగిపోయాయని, రోగులకు అవసరమైన నిర్ణయాలు చేయడంతో తాత్సారం జరుగుతోందని వివరించారు. స్విమ్స్‌లో ప్రాణదాన పథకం పూర్తిగా ఎత్తివేశారని, టీటీడీ బాధ్యతలు తీసుకున్న తర్వాత పేదలకు అందుతున్న వైద్య పరిధి తగ్గిందని అన్నారు. ఆరోగ్యశ్రీలో వస్తున్న నిధులు సరిపోని నేపథ్యంలో వైద్యం పూర్తికాకముందే రోగులను డిశ్చార్జి చేస్తున్నారన్నారు. బర్డ్, స్విమ్స్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు బానిస బతుకులు బతుకుతున్నారన్నారు. శ్రీవారిమెట్టు మార్గంలో చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న పేదలకు న్యాయం చేయాలని కోరారు. చైర్మన్ స్పందిస్తూ భక్తులు, సామాన్యులకు తోడ్పడేలా ఆస్పత్రులను మార్చడానికి కసరత్తు చేస్తున్నామని తెలిపారు.


చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కందారపు మురళి

రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించండి


కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కి గురువారం వినతిపత్రం అందించారు. సదస్సులు నామమాత్రంగా కాకుం డా భూసమస్యలు పరిష్కరించే విధంగా నిర్వహించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కొందరు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, ఆ పరిస్థితి లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

తిరుమలలో చైర్మన్ క్యాంపు కార్యాలయం ప్రారంభం


పూజా కార్యక్రమంలో చైర్మన్ దంపతులు

తిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయంలో చిన్నపాటి మరమ్మతులు చేసి, గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. పండితులు వేదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు శాంతారామ్, డిప్యూటీ ఈవోలు లోకనాథం, హరీంద్రనాథ్, భాస్కర్, వీఎస్వో రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్వీసీఈతో టూరిజం కార్పొరేషన్ ఎంవోయూ


ఎంవోయూ పత్రాలను ప్రదర్శిస్తున్న కలెక్టర్, ఎస్వీసీఈ ప్రిన్సిపాల్

తిరుపతిరూరల్, డిసెంబరు 5(ఆంధ్రప్రదేశ్): కరకంబాడి రోడ్డులోని ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌తో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గురువారం కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమక్షంలో పరస్పర అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకున్నారు. కలెక్టర్‌తో టూరిజం సంస్థ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రమణ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి కలసి ఒప్పంద పత్రాలను ప్రదర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక రంగంపై అవగాహన కోసం ఎక్కువ సంఖ్యలో ఎంవోయూలు అవసరమున్నాయని తెలిపారు. రమణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యాటక రంగంలో వచ్చిన మార్పులపై అవగాహన పెంచుకుని, తమ కెరీర్‌ని మెరుగుపరచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంవోయూ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తారకేశ్వర్, హెడ్ డాక్టర్ ఎం.నీరజ, కోఆర్డినేటర్లు డాక్టర్ టి.శిరీష, డాక్టర్ ఎస్.గౌతమి, వైపీ సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ఒరాటర్ కాంటెస్ట్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ


నారాయణ డీజీఎం, ఏజీఎంలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నారాయణ పాఠశాలల విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ పోటీ ఒరాటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు తెలిపారు. మంగళంలోని నారాయణ పాఠశాలలో ఒరాటర్ పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన కొండలరావు జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నారాయణ విద్యాసంస్థల 11 బ్రాంచిలలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అకడమిక్ అంశాలతో పాటు కమ్యూనికేషన్, పబ్లిక్ స్పీకింగ్, లీడర్‌షిప్ సామర్థ్యాలపై పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు సుమారు 100 మంది వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారని వివరించారు. ఏజీఎం శ్రీనివాసులు, కోఆర్డినేటర్, సాఫ్ట్ స్కిల్స్ హెడ్ సాదిక్, ఆర్లై వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్ హంసవేణి పాల్గొన్నారు.

ఏ డివిజన్లోనూ సమస్యలు కనిపించకూడదు


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు తదితరులు

తిరుపతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రతి డివిజన్‌నూ రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయాలని, ఎక్కడా సమస్యలు కనిపించకూడదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. 35వ డివిజన్‌లో సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్పొరేషన్ రూ.33లక్షలు మంజూరు చేసింది. కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ నేతృత్వంలో వివిధ అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భూమి పూజ నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

కొనసాగిన అనధికార తట్టల తొలగింపు

తిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అనధారిక తట్టల తొలగింపు గురువారమూ కొనసాగింది. గత ప్రభుత్వంలో తిరుమలలో అనధికారికంగా కొన్ని ప్రాంతాల్లో హాకర్లు తట్టలను ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై పది రోజుల క్రితం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి నేరుగా తనిఖీలు చేసి, లైసెన్స్ లేని తట్టను తొలగిస్తామన్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కూడా బుధవారం స్వయంగా వరాహస్వామి విశ్రాంతి భవనం వద్దనున్న హాకర్ల లైసెన్సులను పరిశీలించి సరైన పత్రాలు లేని తట్టలను తొలగించాలని, దుకాణాల ముందున్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఈ క్రమంలో బుధవారం, గురువారం వరాహస్వామి విశ్రాంతి భవనం, డీఎంబీ రోడ్డులోని తట్టలను తొలగించారు. అనధికార తట్టలన్నీ తొలగించాలని టీటీడీ టాస్క్‌ఫోర్స్ ప్రణాళిక రూపొందించుకుంది.

ఏడు కేంద్రాల్లో రెవెన్యూ సదస్సులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండలం పరిధిలో ఏడు కేంద్రాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. 6న తిరుపతి నగరం-కచ్చపి ఆడిటోరియం వెనుక వైపు తుడా కార్యాలయం లేదా ఇందిరా మైదానం, 11న అక్కారంపల్లి-జడ్పీహైస్కూల్, 17న కొంకచెన్నాయిగుంట-ఆటోనగర్, 23న తిమ్మినాయుడుపాళెం-వార్డు సచివాలయం, 26న మంగళం-ధర్మరాజులగుడి, 28న చెన్నయ్యగుంట-శ్రీరాములవారి ఆలయం, 30న శెట్టిపల్లి-వార్డు సచివాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు నిర్వహిస్తారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి గురువారం కోరారు.

తొలిరోజు చెర్లోపల్లెలో రెవెన్యూ సదస్సు

తిరుపతిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రప్రదేశ్): తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె పంచాయతీలో శుక్రవారం తొలి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రామాంజులునాయక్ పేర్కొన్నారు. 7న పుదిపట్ల, 10న కాలూరు, సి.మల్లవరం, 11న దుర్గసముద్రం, 12న కేసీపేట, 13న సీపీయూ కండ్రిగ, 17న గొల్లపల్లె, రామానుజపల్లె, 18న పాడిపేట, 19న పేరూరు, పాతకాల్వ, 20న తుమ్మలగుంట, 21న మల్లంగుంట, 23న వేదాంతపురం, 24న అవిలాల, 26, 27తేదీల్లో తిరుచానూరు, యోగిమల్లవరం, 28న దామినేడు, 30న పాడిపేట, 31న కొత్తూరు, వచ్చే ఏడాది 2న తనపల్లె, నల్లమానికాల్వ, 3న కుంట్రపాకం, 6న ముండ్లపూడి, 7న బ్రాహ్మణపట్టు, పానకం, 8న వేమూరులో ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.







రథమెక్కి... భక్తులను కటాక్షించి..!

● వైభవంగా అమ్మవారి రథోత్సవం









బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటలకు పల్లకీ ఉత్సవం
- 10 గంటలకు పంచమి తీర్థం మండపంలో చక్రత్తాళ్వారు, ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం
- మధ్యాహ్నం 12.15 గంటలకు పద్మసరోవరంలో చక్రస్నానం
- రాత్రి 7.30 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం
- 9.30 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన గురువారం ఉదయం రథోత్సవం వైభవంగా జరిగింది. ముత్యపు కవచపు అలంకారంలో అమ్మవారు సర్వస్వతంత్ర వీరలక్ష్మిగా రథంపై కొలువుదీరారు. ఉదయం 8 గంటలకు ధనుర్లగ్నంలో ప్రారంభమైన రథోత్సవం 10.15 గంటల వరకు మాడవీధుల్లో సాగింది. భక్తులు గోవిందా... గోవిందా అంటూ రథాన్ని లాగారు. రథంపై మిరియాలు, ఉప్పు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రథం మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ జరిగాయి. రాత్రి ఏడు గంటలకు అశ్వవాహనంపై కల్కిరూపంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, సుందరరత్నం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇక, గురువారం రాత్రితో వాహనసేవలు ముగిశాయి. ఈ ఎనిమిది రోజులు.. 16 వాహనాలపై అమ్మవారు వివిధ రూపాల్లో ఊరేగారు.

\- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



జిల్లాలో మోస్తరు వర్షం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. నాయుడుపేట 75.6మి.మీ, దొరవారిసత్రం72.2, శ్రీకాళహస్తి 54.2, తొట్టంబేడు 49, దక్కిలి 47.8, తిరుపతి అర్బన్ 40.8, వెంకటగిరి 39.6, వడమాలపేట 39, బాలాయపల్లి 38.6, సత్యవేడు 36.4, వరదయ్యపాలెం 34.8, ఏర్పేడు, తిరుపతి రూరల్ 30.8, బుచ్చినాయుడు కండ్రిగ 30.4, పెళ్లకూరు 28.8మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. మంగళవారం భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించింది. రూ.3.27 కోట్లు ఆదాయం లభించినట్టు గురువారం ప్రకటించింది. బుధవారం 65,265 మంది శ్రీవారిని దర్శించుకోగా, 21,384 మంది తలనీలాలు సమర్పించారు

భూఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టరేట్లో ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, ఎన్జీవో తదితరులకు రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలం, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అన్ని రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రతి రెవెన్యూ గ్రామాన్ని అధికారుల బృందం సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22ఏ తదితర రెవెన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. రెవెన్యూశాఖలో పలుఖాళీల భర్తీ, శ్మశాన వాటికలకు స్థలాలు, దారివంటి సమస్యలు, 22ఏ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో నరసింహులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించే సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ- గ్రామాల్లో రెవెన్యూ, భూ సమస్యలు, కుల, ఆదాయ ధ్రువీకరణ, సర్వే సమస్యలను పరిష్కరించే దిశగా నిర్దేశిత ప్రణాళికతో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ తయారు చేశామన్నారు. శ్మశాన వాటికలకు స్థలాలు, దారి సమస్యలు, 22ఏ కేసుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. శనివారం జరిగే రెవెన్యూ సదస్సుల్లో ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని చెప్పారు. దేశంలోనే మొదటిగా శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించబోతున్నామన్నారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఈవో కుమార్, జిల్లా సర్వే అధికారి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

‘గోగర్భం’ డ్యామ్‌కు జలహారతి





డ్యామ్ వద్ద టీటీడీ చైర్మన్, అదనపు ఈవో.. జలహారతి ఇస్తున్న అర్చకులు

తిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిండిన గోగర్భం డ్యాం వద్ద గురువారం టీటీడీ పూజలు నిర్వహించింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పూజలు నిర్వహించి జల హారతి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో గోగర్భం, ఆకాశ గంగ, పాపవినాశనం డ్యాములు పూర్తిగా నిండాయని అదనపు ఈవో తెలిపారు. మరోసారి వర్షం పడితే కుమారధార, పసుపుధార డ్యాములు నిండిపోతాయన్నారు. ప్రస్తుతం రోజుకు 50 లక్షల గ్యాలన్ల నీరు వినియోగమవుతోందన్నారు. తిరుపతి కల్యాణి డ్యాం సహా ప్రస్తుత నీటి నిల్వలు 300 రోజులకు సరిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు శాంతారామ్, డిప్యూటీ ఈవో లోకనాథం, వాటర్‌వర్క్స్ ఈఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురువారం సాయంత్రం 4 గంటలకు నీటి నిల్వలిలా

డ్యాములు	సామర్థ్యం	ప్రస్తుతం
పాపవినాశనం	5,240 (లక్షల గ్యాలన్లు)	5,208
కుమారధార	4,258	3,724
పసుపుధార	1,287	966
గోగర్భం	2,833	2,833
ఆకాశగంగ	685	685



ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల అధికారులు

ఎస్వీయూతో ఎస్వీ మెడికల్ కాలేజీ ఎంవోయూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూతో ఎస్వీ మెడికల్ కాలేజీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. వైద్య పరిశోధనలు చేపట్టే లక్ష్యంతో ఇరు సంస్థల అధికారులు గురువారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. ఇరు సంస్థల్లోని ల్యాబ్‌లలో చేపట్టే పరిశోధనా ఫలితాలు రోగుల ఆరోగ్యం మెరుగుపరచడానికి ఉపయోగ పడతాయన్నారు. రుయా సూపరింటెండెంట్ రవి, మెటర్నిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

ఏ మొహం పెట్టుకుని పోరుబాట చేస్తారు?

● జగన్‌కు శాప్ చైర్మన్ ప్రశ్న



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి రూ.3,500 కోట్లు బకాయి పెట్టిన మాజీ సీఎం జగన్.. ఇప్పుడు ఏ మొహంపెట్టుకుని కూటమి ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమవుతున్నారో చెప్పాలని శాప్ చైర్మన్ రవినాయుడు ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కరోనా సమయంలో కళాశాలలు నడపలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కోర్టుకు వెళితే వారిని తాడేపల్లికు పిలిపించి బెదిరింపులకు పాల్పడలేదా? వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల రెండు లక్షల మందికిపైగా విద్యార్థుల సర్టిఫికెట్లు యాజమాన్యాల వద్దే ఉన్నాయి. నాడు సీఎంగా విద్యార్థులకు అన్యాయం చేసిన జగన్.. ఇప్పుడు పోరుబాట పట్టడం హాస్యాస్పదంగా ఉంది' అని అన్నారు. ఆ రూ.3,500 కోట్ల బకాయిలను విడతల వారీగా అందజేయడంతో పాటు ఈ ఏడాది ఫీజు చెల్లించడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమీక్షించారన్నారు. ఈ సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్‌రాయల్, రాష్ట్ర కార్యదర్శి ఆర్కే నాయుడు, బషీర్, రాజు, గంగాధర్ పాల్గొన్నారు.

శ్రీరంగం శ్రీవైష్ణవులకు సన్మానం

తిరుచానూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఉదయం, సాయంత్రం వాహనాలను మోస్తున్న శ్రీరంగం శ్రీవైష్ణవులను గురువారం రాత్రి టీటీడీ ఈవో శ్యామలరావు సన్మానించారు. 10 గ్రాముల శ్రీవారి వెండి డాలరు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. 32 ఏళ్లుగా వీరు విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ఒక్కో వాహనం 2.5 టన్నులకుపైగా బరువు ఉంటుందన్నారు. దాదాపు మూడు గంటలపాటు బరువును మోస్తూ వాహన బ్యారర్లు తమ భక్తి భావాన్ని చూపారని కొనియాడారు. వాహన బేరర్లలో కొందరు చెన్నై, బెంగళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో ఐటీ, రైల్వే, బ్యాంకు, ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్నారని, మరికొందరు విద్యార్థులు కూడా ఉన్నట్లు వివరించారు.

రోజంతా శుభ ఘడియలు

పంచమి తీర్థానికి విచ్చేసే భక్తులకు అంకిత భావంతో సేవలందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు పిలుపునిచ్చారు. తిరుచానూరు ఆస్థాన మండపంలో గురువారం సాయంత్రం టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులతో ఆయన సమావేశమయ్యారు. శుభ ఘడియలు రోజంతా ఉంటాయని, భక్తులు తోపులాటలకు గురికాకుండా సాయంత్రం వరకు పుష్కరిణిలో స్నానం ఆచరించవచ్చన్నారు. భక్తులకు శ్రీవారి సేవకులు అందిస్తున్న సేవల వల్ల టీటీడీకి మంచి పేరు వచ్చిందన్నారు. టీటీడీ ఉద్యోగులు మరింత బాధ్యతతో సేవలు అందించాలని సూచించారు. పంచమితీర్థం రోజున 1000 మంది శ్రీవారి సేవకులతో అన్నప్రసాదం, తాగునీరు పంపిణీ చేయనున్నట్లు ఈవో తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అన్నప్రసాదం స్పెషలాఫీసర్ జీఎల్ఎన్ శాస్త్రి, డిప్యుటేషన్ ఉద్యోగులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.



శ్రీరంగం శ్రీవైష్ణవులను సత్కరిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

ముంతాజ్ హోటల్ అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

● 20 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

● శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్

తిరుపతి(లీలామహల్), డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పేరూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 604/2లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్‌ను కూల్చివేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి డిమాండు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ- ఈ హోటల్ పనులు ఆపాలని టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం చేశారన్నారు. అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నట్లు గుర్తించిన తుడా అధికారులు, పేరూరు పంచాయతీ కార్యదర్శి ఈనెల 4వ తేదీన తేదీన ఈ పనులను ఆపాలని నోటీసులు ఇచ్చారన్నారు. అనుమతులుంటే వారంలోపు చూపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారన్నారు. అయినా, రాత్రింబవళ్లు నిర్మాణాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకుని, అక్కడి వాహనాలు సీజ్ చేసి, హోటల్‌కు ఇచ్చిన 20 ఎకరాల భూమిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండు చేశారు. లేకుంటే హిందూ సంఘాలతో కలిసి స్వామీజీలం నిరశన దీక్ష చేస్తామన్నారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్, చంద్రమౌళి, బాలకృష్ణ, మధు, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

8న కృత్రిమ కాలుకు కొలతలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని విభిన్న ప్రతిభావంతుల్లో అవసరమైన వారికి ఈనెల 8న తపోవనంలో కృత్రిమ కాలుకు కొలతలు తీసుకోనున్నారు. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 20 రోజుల తర్వాత ఆధునిక వెయిట్‌లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చుతామన్నారు. అవసరమైన వారు సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, నూతన కలెక్టరేట్ భవనం, అంబేడ్కర్ భవన్, చిత్తూరు అనే చిరునామాలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 94403 57522 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

డీటీసీవోగా జనార్దనరెడ్డి



తిరుపతి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి డిస్ట్రిక్ట్ టూరిజం అండ్ కల్చరల్ ఆఫీసరు (డీటీసీవో)గా ఎం.జనార్దనరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు టూరిజం రీజనల్ డైరెక్టర్‌గా ఉన్న రమణప్రసాద్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు.

సమర్థవంతంగా సదస్సులు నిర్వహించాలి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆదేశించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహీల్దార్లు, ఎంపీడీవోలతో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి జనవరి 7వ తేదీ వరకు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నా మన్నారు. ఈ సదస్సుల ద్వారా ప్రజలు భూసమస్యలను పరిష్కరించుకునే వీలుంటుందన్నారు. ప్రధానంగా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందన్నారు. గ్రామంలో జరిగే గ్రామసభల్లో ప్రజలు భూసమస్యలను రెవెన్యూ అధికారులకు తెలియజేస్తే వాటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సస్పెండ్ చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో అక్రమంగా సస్పెండ్ చేసిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో కార్యదర్శి శ్రీధర్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ సభ్యుల పట్ల అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని మానుకోవాలన్నారు. డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లను అక్రమంగా డిపో మేనేజర్ సస్పెండ్ చేయడం తగదన్నారు. ఏకపక్షంగా వ్యవహరించడం, ఉద్దేశపూర్వకంగా విధుల నుంచి సస్పెండ్ చేయ డాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ కోరారు. గురు వారం స్థానిక బాలాజీ జూనియర్ కళాశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించేలా విద్యార్థులకు పోటీపరీక్షలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌పట్ల అవగాహన కల్పించేందుకు ఈ తరహా పోటీలను నిర్వహించి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో బహుమతులను అందజేశామని వివరించారు.

అట్రాసిటీ కేసులో ఒకరి అరెస్ట్

పెళ్లకూరు, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని చిల్లకూరులో రెండు నెలలు క్రితం దళిత మహిళను కులం పేరుతో దూషించిన కేసులో నిందితుడుగా ఉన్న అదే గ్రామానికి చెందిన ఆళ్ల నాగార్జునను డీఎస్పీ గురు వారం రాత్రి అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు పంపారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయం లో గురువారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాం గులకు నిత్యా వసరాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ దివ్యాంగులకు చేయూతనందించేలా ప్రతినెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహలత, డాక్టర్ తనూజ, అనిత, జనా సుధీర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

పుత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే ఈనెల 6వ తేదీ నుంచి సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ తేదీన తడుకు, 7న కళింకుప్పం, శిరుగురాజుపాలెం, 9న తొరూరు, 10న నేసనూరు, 11న గోవిందపాలెం, వీరప్పరెడ్డిపాలెం, 12న నందిమంగళం, 13న వేపగుంట, ఉత్తరపుకండ్రిగ, 16న పరమేశ్వరమంగళం, 17న తిరుమలకుప్పం, 18న కెబిఆర్‌పురం, 19న పుత్తూరు, 20న చెర్లోపల్లి, 21న ఈశ్వరాపురం, 23న కె.ఎం.అగ్రహారం, గొల్లపల్లెల్లో సదస్సులు జరుగుతాయని వివరించారు.

వడమాలపేట: మండలంలోని నేటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహి స్తున్నట్టు తహసీల్దార్ జరీనా చెప్పారు. ఈనెల 6వ తేదీన శుక్రవారం కల్లూరులో, 7న ఏఎంపురం,9న ఎస్వీపురం, 10న రామసముద్రం, 11న వడమాల, 12న పాదిరేడు, 13న పాదిరేడు అరణ్యం, 16న తట్నేరి, 17న టీసీ. అగ్రహారం, 18న శ్రీనివాసపురం, 19న ఎస్‌బీఆర్ పురం, 20న కదిరిమంగళం, 21న కేజీ కండ్రిగ, 23న పూడి, 24న కాయం, 26న తిరుమణ్యం, 27న వేమాపురం, 28న పత్తిపుత్తూరు, 30న అయ్యన్నగారిపల్లి, జనవరి 2వ తేదీ సీతమ్మ అగ్రహారం, 3న సీతారామపురంలలో సదస్సులు జరుగుతాయన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు సదస్సులో పాల్గొని భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

తిరుచానూరు పంచమీ తీర్థం ఎఫెక్ట్...

ఆర్టీసీ సర్వీసుల దారి మళ్లింపు

పుత్తూరు, డిశంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పంచమి సందర్భంగా తిరుపతికి వెళ్లే బస్సు సర్వీసులను రేణిగుంట మీదుగా మళ్లించామని పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజరు ప్రశాంతి తెలిపారు. 6వ తేదీ శుక్రవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బస్సు సర్వీసుల మళ్లింపు వివరాలను తెలిపారు. చెన్నై, సత్యవేడుల నుంచి తిరుపతికి వెళ్లే సర్వీసులు కేఎల్‌ఎం హాస్పిటల్ నుంచి రేణిగుంట మీదుగా వెళతాయన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో తిరుపతి మామిడికాయల మండీ నుంచి ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు.

ముగిసిన రైల్వే యూనియన్ ఎన్నికలు

పుత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు జరిగిన రైల్వే యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక రైల్వే పీడబ్ల్యూడీ కార్యాలయంలో పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన పోలింగ్‌లో 295 ఓట్లకు గాను 273 పోలైనాయి. ఈ దక్షిణ రైల్వే కార్మిక్ సంఘ్, రైల్ మజ్దూర్ యూనియన్, సదరన్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్లు పోటీ చేశాయి. చెన్నై డివిజన్‌లో వున్న ఇరవై వేల అయిదు వందల ఓట్లలో 30 శాతం వచ్చిన యూనియన్లకు గుర్తింపు ఉంటుంది. రైల్వే జీఆర్పీ ఇన్‌చార్జి హరినాథరాజు, సీఐబీ నరసింహరాజు బందోబస్తును పర్యవేక్షించారు.

జిల్లా మైనార్టీ సెల్ అధికారితో భేటీ


చెన్నారెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ముస్లిం మైనార్టీ నాయకులు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ చెన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం చిత్తూరు కార్యాలయంలో కలిసి సన్మానించారు. అనంతరం పుత్తూరు షాదీ మహల్ అభివృద్ధిపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన జిల్లా అధికారి నూతన పాలకమండలికి షాదీ మహల్ భవనాన్ని, ఇతర బాధ్యతలను అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు రఫీ అహ్మద్, గేట్ పుత్తూరు గేట్ మసీదు మస్జిద్ ఏ ముఖద్దస్ ముతవల్లీ మహమ్మద్ గౌస్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నగరి నియోజకవర్గ అధ్యక్షుడు ఎద్దుల హుస్సేన్, చిత్తూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కే. షబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు జాబ్‌మేళా

వెంకటగిరిటౌన్, డిసెంబరు 5,(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఉమారాణి గురువారం తెలిపారు. అమర్ రాజా గ్రూప్స్, గ్రీన్లం లిమిటెడ్, డైకిన్ ఎయిర్ కండీషనింగ్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులని వివరించారు.

వేనాటి మునిరెడ్డికి పలువురి నివాళి



తడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు మాజీ ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ వేనాటి మునిరెడ్డి 24వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మునిరెడ్డి చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్ఠతకు మునిరెడ్డి కృషిచేశారని టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీలకంఠం, రమేష్, గిరిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

నాయుడుపేట/సూళ్లూరుపేట డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు భూ పంపిణీ చేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రెవెన్యూ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రెవెన్యూ, ఇతర శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అన్నివర్గాల శ్మశానవాటికలు అభివృద్ధి చేయాలని, రోడ్లు నిర్మించాలని కోరారు.

నేడు ఎంపీడీవో కార్యాలయం ప్రారంభం

వెంకటగిరిటౌన్, డిసెంబరు5, (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎంపీడీవో నూతన కార్యాల యం శుక్రవారం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతులు మీదుగా ప్రారంభిస్తున్నామని ఎంపీపీ తనూజ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని కోరారు.

గుంతలమయంగా జాతీయ రహదారి



నాయుడుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వర్షాలకు నాయుడుపేట -పూతలపట్టు 71వ జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. ఈ జాతీయ రహదారిలో తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలకు, ఉపాధి నిమిత్తం బెంగళూరుకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చించాలని కోరుతున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య


మృతి చెందిన వృద్ధుడు రమణయ్య

దొరవారిసత్రం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపట్టురాజు పాళెం గిరిజన కాలనీకి చెందిన చిలకల రమణయ్య(67) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో డబ్బుల విషయంలో భార్య సుబ్బులమ్మతో వివాదం ఏర్పడింది. మనస్తాపానికి గురై బుధవారం గడ్డి మందు తాగాడు. బంధువులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గేదెను ఢీ కొన్న ద్విచక్ర వాహనం.. ఒకరి మృతి

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కేశవరం వద్ద గురువారం తెల్లవారుజామున గేదెను ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. స్థానికుల కతనం మేరకు..నెల్లూరుకు చెందిన నాయబ్ రసూల్, చంద్రశేఖర్, బెంగళూరుకు చెందిన మూర్తి నవీన్(22)లు ద్విచక్ర వాహనంలో గూడూరు నుంచి కోట వైపు వెళ్తున్నారు. కేశవరం వద్ద అదుపుతప్పి గేదెను ఢీకొన్నారు. ముగ్గురూ గాయపడ్డారు. వారిని నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మూర్తినవీన్ మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి


మాట్లాడుతున్న ఏడీఏ నాగర్జున సాగర్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 5, (ఆంధ్ర జ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులనే వినియోగిం చాలని ఏడీఏ నాగర్జున సాగర్ అన్నారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్ట ఎరువులు వాడడం అలవాటుగా మార్చుకోవాలని తెలియజేశారు. రైతులకు పీఎం ఫసల్ బీమా యోజన గురించి వివరించారు. తర్వాత అనంతరాజు పేట హార్టికల్చర్ విద్యార్థులకు భూసార పరీక్షల నమూన ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, ఏవో సుజాత, ఆనంద్‌రెడ్డి, రాజీవన, నాగర్జున రెడ్డి, తిరుపాల్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలను

సస్యశ్యామలం చేస్తాం

పర్యావరణ పరిరక్షణ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి


దినేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీర ప్రాంతాలలో కోట్లాది రూపాయలతో ముఖద్వారాలు పూడికతీసి గిరిజన, మత్స్యకార గ్రామాలను సస్యశ్యామలం చేస్తామనిపర్యావరణ పరిరక్షణ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. కోట పట్టణంలోని షాదీమందిర్‌లో గురువారం ఎఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో చిల్లకూరు, కోట, వాకాడు మండలాల మత్స్యకారులు, గిరిజనుల జీవన విధానంపై ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు వారితో ముఖాముఖి నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే మాట్లాడుతూ పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీత పనులు చేపడుతామన్నారు. వాకాడు మండలం పూడిరాయదొరువు సముద్రముఖద్వారం పూడికతీతకు రూ.97 కోట్ల నిధులను కేటాయిం చామన్నారు. ఆయా పనులు త్వరగా జరుగుతాయన్నారు. రాష్ట్రానికి ఉన్న 932 కిలోమీటర్ల సముద్రతీరాన్ని సుందర వదనంగా తీర్చిదిద్ది మత్స్యకార, గిరిజనుల జీవితాలలో వెలుగులు నింపుతామన్నారు. రానున్న ఐదేళ్లల్లో విద్యామంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో 20 లక్షల ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఆయన చొరవతోనే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుక పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ సముద్రాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న మత్స్యకార గిరిజనుల పక్షపాతి సీఎం చంద్రబాబు అని తెలిపారు. ప్రతి మత్స్యకార బిడ్డా చదువుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో కోట మండలం కేశవరం పంచాయతీలలో పేదల భూములను వైసీపీ నాయకులు కబ్జా చేశారన్నారు. చిల్లకూరు మండలంలో అప్పటి వైసీపీ నాయకులు సిలికా మైన్‌లను దౌర్జన్యంలా లాక్కున్నారన్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన భూబకాసురల భరతం పడుతామన్నారు. అనంతరం గిరిజన మత్స్యకారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని దినేష్‌రెడ్డికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో ఏఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ బషీర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, మధుయాదవ్, పోలయ్య, తూపిలి రాధాకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సురేష్, షంషుద్దీన్, మస్తాన్‌బాషా ఉన్నారు.

గోతులమయం.. ప్రమాదకరం



వేములపాళెం సమీపంలో గోతులమయంగా మారిన ప్రధానరహదారి ● బీసీకాలనీ సమీపంలో విందూరు మార్గంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి మండలంలోని వేములపాళెం గ్రామానికి వెళ్లే ప్రధానరహదారి గోతులమయంగా మారింది. రాకపోకలు సాగించడానికి గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గూడూరు పట్టణం నుంచి వేములపాళెం మీదుగా విందూరు, రామలింగాపురం, చంబడిపాళెం, సంతదాసుపల్లి, ఈదలపల్లి, మిటాత్మకూరు తదితర గ్రామాలకు ప్రజు రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు పది గ్రామాలకు పైగా ప్రజలు వేములపాళెం మీదుగా గూడూరుకు వస్తుంటారు. విద్యార్థులు, రైతులు, కూలిపనులను వెళ్లేవారు తదితరులు వారివారి గ్రామాల నుంచి వాహనాల్లో వస్తుంటారు. గూడూరు బీసీకాలనీ నుంచి వేములపాళెం గ్రామానికి వెళ్లే మార్గం అడుగడుగునా గోతుల మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మార్గం మరింత గుంతలమయ మైంది. ఐదారు చోట్ల భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. స్థానిక బీసీకాలనీ సమీపంలో, మల్లితోట వాటర్‌వర్క్స్ సమీపంలో ప్రధాన రహదారి దారుణంగా తయారైంది. ఒక్కో ప్రాంతంలో పది అడుగులకు మేర రోడ్డు దెబ్బతింది. గోతుల్లో నీళ్ల నిలిచి మడుగులా మారింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు గుంతల్లో దిగి ప్రమాదాలకు గురవుతున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట గుంతలు కనిపించక ఎక్కువ మంది ద్విచక్రవాహనదారులు గోతుల్లో పడ్డారు. రహదారిని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జనార్దనరెడ్డి మరణం టీడీపీకి తీరని లోటు

● ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ


జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, డిశంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్దన్‌రెడ్డి మరణం టీడీపీకి తీరని లోటని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. గురువారం శిరసనంబేడులో శాస్త్రోక్తంగా జరిగిన కర్మక్రియల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తదితరులు జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వేలూరు కుటుంబసభ్యులైన హరిబాబురెడ్డి, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, సాయిగిరిధర్‌రెడ్డి తదితరులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పెళ్లకూరు, ఓజిలి దొరవారిసత్రం టీడీపీ మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, విజయ్‌కుమార్‌నాయుడు, శ్రీనివాసులు నాయుడు, నాయకులు పేరం రమేష్‌నాయుడు, కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్‌నాయుడు, నాయుడుపేట ఎంపీపీ కురుకొండ ధనలక్ష్మీ, వేలూరు హరినాయుడు, తాళ్ల యుగందర్‌గౌడ్ నివాళులు అర్పించారు.

జిల్లా పరిషత్ భూములకు రక్షణ కల్పిస్తాం


గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, అధికారులు

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న జిల్లా పరిషత్ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు ఆ భూముల పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు తెలిపారు. కోట మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచిచూశారు. భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గ్రంథాలయం ఉన్న జిల్లా పరిషత్ భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ భూముల లీజులు కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పరిషత్ భూములను ఎవరైన ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో వేణు, పలుశాఖల అధికారులు ఉన్నారు.

టీడీపీ మైనార్టీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని దాదరాయి గుంట వద్ద నివాసం ఉంటున్న టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ నౌషాద్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ గురువారం పరామర్శించారు. షేక్ నౌషాద్ తల్లి మాజీ ఎంపీటీసీ గౌసినీషా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డిలు నౌషాద్‌ను పరామర్శించారు.

కోటలో వికలాంగుల దినోత్సవం

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోటలోని షాదీ మందిర్‌లో గురువారం ప్రపంచ వికలాంగ దినోత్సవం జరిగింది. వికలాంగ సంక్షేమ సంఘం నాయకులు సుధీర్, కృష్ణల ఆధ్వర్యంలో కేక్‌ను తీసుకువచ్చి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సమక్షంలో కేక్ కట్‌చేశారు.

కొత్తచెరువుకు గండి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని బిరదవాడలోని కొత్తచెరువు తూముకు ఇటీవల కురిసిన వర్షాలతో గండి పడింది. దాంతో చెరువులో నీరు ఆయకట్టులోని పొలాల్లోకి నీరు చేరుతుంది. వరిపైరు మొత్తం నీట మునిగింది. ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలించి పరిహారం అందించాల్సిందిగా రైతులు కోరుతున్నారు.

అడుగువేయాలంటే.. బురద తొక్కాల్సిందే

● తిన్నెలపూడి దళిత కాలనీల్లో వసతులు కరువు
● చెరువులా మారిన వీధులు




తిన్నెలపూడి దళితవాడలో గోతులను తలపిస్తున్న వీధులు, తూర్పుదళితవాడ వీధుల్లో ప్రవహిస్తున్న మురుగు, దక్షిణ దళితవాడలో మడుగును తలపిస్తున్న వీధులు

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీలో పలు దళితవాడలు దుర్గంధంలా మారాయి. తిన్నెలపూడి దళితవాడ, తూర్పు దళితవాడ, దక్షిణ దళిత వాడల్లో చెత్తపేరుకు పోయింది. సిమెంటు రోడ్లు, మురుగుకాలువలు లేకపోవడంతో వర్షపునీరంతా వీధుల్లో నిలిచిపోయింది. వీధులన్నీ చెరువుల్లా మారాయి. ఇంటి ముందు అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి. అడుగు వేస్తే బురదలో వేయాల్సిందే. ఇక దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వీధుల్లో నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని దళితులు కోరుతున్నారు.

ఎన్‌ఏబీఎల్ గుర్తింపుపై అవగాహన


సదస్సులో ప్రసంగిస్తున్న రంజిత్ కుమార్, శ్రీరామ్

శ్రీసిటీ, డిసెంబరు 5: క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ)అనుబంధ సంస్థ నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబోరేటరీసస్ (ఎన్‌ఏబీఎల్), శ్రీసిటీ సహ కారంతో గురువారం శ్రీసిటీలోని పరిశ్రమలకు 'ఎన్‌ఏబీఎల్ గుర్తింపు, ప్రయోజనాలు' అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించింది. ఎన్‌ఏబీఎల్ బెంగళూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి శ్రీసిటీతో పాటు పరిసర ప్రాంతాల్లోని వివిధ పరిశ్రమలకు చెందిన 50మందికి పైగా నాణ్యతా నిపుణులు హాజరయ్యారు. ఎన్‌ఏబీఎల్ క్యూసీఐ డిప్యూటీ డైరెక్టర్ డి.రంజిత్‌కుమార్ మాట్లాడుతూ... ఎన్‌ఏబీఎల్ గుర్తింపు వల్ల పరిశ్ర మలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో చేకూరే ప్రయోజనాల వివరించారు. ఐఎస్‌వో/ ఐఈఎస్ 170011:2017 ప్రమాణాలను అనుసరించడంతో పాటు ఆసియా పసిఫిక్ అక్రెడిటేషన్ కో ఆపరేషన్ (ఏపీఏసీ), లాబోరేటరీ అక్రెడిటేషన్ కో ఆపరేషన్ (ఐఎల్ఏసీ), మ్యూచువల్ రికగ్నిషన్(ఎంఆర్ఏ)లో సంతకం చేసిన అక్రెడిటేషన్ సంస్థగా ఎన్‌ఏబీఎల్ గుర్తింపు కలిగి ఉందన్నారు. ఇది వివిధ రంగాల పరిశీలన ల్యాబోరేటరీలకు స్వచ్ఛంద అక్రెడిటేషన్ సేవలను అందిస్తుందని తెలిపారు ఎన్‌ఏబీఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్ పిన్నమరాజు మాట్లాడుతూ... ఎన్‌ఏబీఎల్ వెబ్‌సైట్, అందులోని వనరులు, డాక్యుమెంటేషన్‌ను వివరించారు. అనంతరం జరిగిన చర్చా వేదికలో పరిశ్రమల ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంతో పాటు ఎన్‌ఏబీఎల్ గుర్తింపై లోతైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తిరుపతి ఐఐఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శంతను భట్టాచార్య, ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ వై.వీ.రామిరెడ్డి, శ్రీసిటీ కస్టమర్ రిలేషన్స్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నవీన్


నవీన్ సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణవనం, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.ఎస్.నవీన్‌కుమార్ జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులోచన తెలిపారు. గత వారం చిత్తూరు జిల్లా అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్ 14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తిరుపతి జిల్లా జట్టు క్యాచర్‌గా ప్రతిభను కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. త్వరలో రాజస్థాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో నవీన్ ప్రాతినిధ్యం వహిస్తాడని వ్యాయామ ఉపాధ్యాయుడు ఏ.జయప్రకాష్ తెలిపారు. అలాగే గతం వారంలో తిరుపతి లోని మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్ 14 బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో 8వ తరగతి విద్యార్థి ఎస్.బాలాజీ బంగారు పతకాన్ని సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా గురువారం ఎంఈవో ప్రభాకర్ రాజు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాల్ని అందజేసి, అభినందించారు. ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, వర్మ, కోటి, వెంకటరమణ, మునివేలు తదితరులు ఉన్నారు.

కనీస వేతనం చెల్లించండి: ఏఐటీయూసీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పురపాలకసంఘ కార్మికులకు కనీస వేతనం రూ.31వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సాధారణ సర్వసభ్య సమావేశం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ శాఖ ద్వారా నేరుగా కార్మికులకు జీతాలు ఇవ్వాలన్నారు. ఇక కరోనా కాలంలో పనిచేసిన పురపాలక సంఘ కార్మికులు 24 మందికి జీతాలు ఇవ్వకపోగా పని నుంచి తొలగించడం అన్యాయమన్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వైఎస్ మణి, హరినాథ్, కొండమ్మ, శారద, వెంకటేష్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో లోబావి గిరిజన కాలనీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోబావి గిరిజనకాలనీలో అంధకారం నెలకొంది. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఈ కాలనీలో వీధి విద్యుత్ దీపాలు వెలగడంలేదు. దీంతో రాత్రైతే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలనీ మొత్తం చిమ్మచీకట్లతో రోడ్లు కనిపించకుండా చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ విషపురుగులు ఇళ్లల్లోకి ప్రవేశిస్తాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేసి వెలిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

ప్రపంచ నేల దినోత్సవంపై రైతులకు అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు గురువారం అవగహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి భారతి మాట్లాడుతూ ఆహార ఉత్పత్తికి నేల ప్రధాన వనరు అన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం తగ్గించి రసాయన ఎరువుల వినియోగంతో నేల నిస్సారమై నిర్జీవమైపోతోందన్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే జీవరాశి మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు.

రేణిగుంట: మండలంలోని కేవీకేలో గురువారం నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతులకు మట్టి సంరక్షణ, కొలమానం, పర్యవేక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


బాలసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న మురళీనాయుడు తదితరులు


శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంను గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మురళీనాయుడు మాట్లాడతూ... బాలసుబ్రహ్మణ్యం గత 12 సంవత్సరాలుగా పాఠశాలలో ఉత్తమంగా బోధిస్తున్నారన్నారు. కళలు, సాహిత్యంతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, విశ్రాంత ఎంపీడీవో మోహన్‌రావు, ముని, చంద్రారెడ్డి, కస్తూరయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త మోహన్‌రాణి, ఆదిలక్ష్మి, పద్మ, జయరత్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి: సీఎంకు వినతి


సీఎంకు వినతిపత్రం అందిస్తున్న గురవారెడ్డి

ఏర్పేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో చేసిన పనుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయించాలని సీఎం చంద్రబాబును టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. అలాగే ఐదేళ్ల వైసీపీ పాలనలో వైసీపీ నాయకులు పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయించాలని, పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాయకులకు నామినేటెడ్ పదవుల్లో సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అనంతరం ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

జోరుగా కలుజు పారుతున్న ఆరె కొత్త చెరువు



కేవీబీపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరె గ్రామంలో ఉన్న కొత్త చెరువు ఇటీవల మరమ్మతులు చేయించడంతో నీటితో నిండి కలుజు పారుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2020లో కట్ట తెగి చెరువులో నీరు పొలాలను ముంచివేసింది. దీంతో పాటు చెరువులో ఉన్న చిన్న, పెద్ద రాళ్ల పొలాల్లో మేట వేశాయి. అయితే అప్పటి ప్రభుత్వం చెరువు విషయాన్ని పట్టించుకోలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇరిగేషన్ డీఈ రత్నారెడ్డి, ఏఈ బాబు చొరవ తీసుకుని చెరువుకు మరమ్మతులు చేయించారు. దీంతో ప్రస్తుతం చెరువు నిండి కలుజు పారుతోంది. చెరువు కింద సుమారు 800 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. కలుజు పారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ కాపు సంఘ నియోజకవర్గ అధ్యక్షుడిగా సతీష్‌కుమార్

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ కాపు సంఘం శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎ.సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణమ నాయుడు ఉత్తర్వులు పంపారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు.

ఆర్ అండ్ బీ అధికారుల తీరు మారదా?

సత్యవేడు - శ్రీకాళహస్తి మధ్య ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


రోడ్డుపై బారులు తీరిన వాహనాలు - పచ్చని చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వరదయ్యపాళెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ అధికారులు తీరు మార్చుకోవాలని మండలవాసులు అంటున్నారు. సత్యవేడు - శ్రీకాళహస్తి రోడ్డు పరిసరాల్లో మొదట గ్యాస్ పైప్‌లైన్ కోసం ఏజీఅండ్‌పీ కంపెనీ నిర్వాహకులు రోడ్డు పక్కన తవ్వకాలు చేపట్టారు. మరో పక్క వాటర్ పైప్‌లైన్ కోసం తవ్వకాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లను నరికేశారు. మరికొన్ని చోట్ల గుంతలు తవ్వి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూడ్చలేదు. దీంతో ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. గంటల తరబడి వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో శ్రీసిటీకి వెళ్లే కార్మికులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు, పనుల కోసం వచ్చే ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చించి చెట్లను నరకకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యవేడు తహసీల్దార్ సుబ్రమణ్యం

సత్యవేడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులను అధికారులు, సిబ్బంది విజయవంతం చేసేందుకు సహకరించాలని తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం కోరారు. మండలంలో ఈనెల 6 నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులపై గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో డిసెంబరు 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. సదస్సు నిర్వహణకు ముందు సంబంధిత గ్రామంలో దండోరా వేసి ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని ఆదేశించారు. వివిధ భూ సమస్యలకు సంబంధించి వచ్చే వినతులకు అప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో నమోదు చేసి రశీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, మండల పరిషత్ ఏఈ ఇబ్రహీం ఖాన్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ మునిరవికుమార్, వీఆర్వోలు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: సర్పంచులకు రెవెన్యూ సదస్సులపై మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్రమణ్యం అవగాహన కల్పించారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే సదస్సుల్లో 22ఏ, భూ సంబంధిత సమస్యలు సహా ఇతర భూ సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: మండలంలో ఈనెల 6వ తేదీ కొత్తపల్లిచింతల, మన్నవరం, కలవగుంట, వెలంపాడు, యార్లపూడిల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. అలాగే ఈనెల 9న పాతగుంట, మంగలగుంట, మేలచ్చూరు, 10న పాపనపల్లి, బ్రాహ్మణపల్లి, బీవీపురం, గొల్లపల్లి, మూర్తిపాళెం, 11న కొత్తూరు, కుంటిపూడి, రామానుజపల్లి, 12న ఇనగలూరు, పోలి, వాంపల్లి, భీమవరం, గోవిందరావుపల్లి, 13న ఎంపేడు, అమ్మచెరువు, వాగవేడు, కోనేరుగుంట, వెంగళంపల్లి, 16న మంగళపురి, ముద్దమూడి, అనంతపద్మనాభపురం, 17న ఉడమలపాడు, చెరుకులపాడు, కమ్మకొత్తూరు, పెనుబాక, 18న ముచ్చివోలు, యర్రగుడిపాడు, బోడావారిపల్లి, 19న అక్కుర్తి, 20న ఓబులాయపల్లి, రెడ్డిపల్లి, నారాయణపురం, గుంటకిందపల్లి, 21న ఊరందూరు, 23న మద్దిలేడు, 24న అరవకొత్తూరు, 26న శ్రీకాళహస్తి, అప్పలాయగుంట, 27న పానగల్, చుక్కల నిడిగల్లు, 28న చెర్లోపల్లి, చెర్లోపల్లి వ్యవసాయ కండ్రిగ, 30న చల్లపాళెం, రాచగున్నేరి, 31న కాపుగున్నేరి, ఎంఎంసీకండ్రిగ, జనవరి 2న తొండమనాడు, ఎగువవీధి, దిగువవీధి, 3న అమ్మపాళెం, పుల్లారెడ్డికండ్రిగ, 4న సుబ్బానాయుడుకండ్రిగ, 6న రామలింగాపురం, బొక్కిసంపాళెం, 7న రామాపురం, 8న వేడాం, సహస్రలింగేశ్వరపురంలల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. భూసమస్యలు ఉన్నవారు ఈ సదస్సులకు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.

ఏర్పేడు: దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం నుంచి జనవరి 6వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు భార్గవి తెలిపారు. 6వ తేదీ పల్లంలో, 7న చింతపాళెం, 9వ తేదీ ఉదయం పంగూరు, సాయంత్రం పాగాలి, 10న ఉదయం కాట్రకాయలగుంట, మధ్యాహ్నం శ్రీనివాసపురం, 11న చిందేపల్లి, 12న ఉదయం కృష్ణంపల్లి, మధ్యాహ్నం దుర్గిపేరి, 13న నచ్చనేరి, నాగంపల్లి, 14న మేర్లపాక, 17న మన్నసముద్రం, 18న ముసలిపేడు, 19న కందాడు, 20న కోబాక, మోదుగుల పాళెం, 21న ఎండీపుత్తూరు, మునగలపాళెం, 23న వికృత మాల, 26న చెల్లూరు, 27న గుడిమల్లం, 28న పెనుమల్లం, పెనగడం, 30న మాధవమాల, జనవరి 2న ఇసుకతాగేలి, చిన్నఅంజిమేడు, 3న పెద్ద అంజిమేడు, 4న ఏర్పేడు, సీతారాంపేట, 6న రావిళ్లవారికండ్రిగ సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దారు తెలిపారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలను వేదోక్తంగా నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ చేశారు. అనంతరం వినాయక పూజలు, కలశ వైదిక కత్రువులు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. సుగంధ పరిమళాలు వెదజల్లే పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత, చక్ర, కుంభ, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

భూ కబ్జా చేసిన వారిపై కేసులు పెట్టండి: సీపీఐ

రేణిగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేయాలని సీపీఐ శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి జె.గురవయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో గుంట పోరంబోకు ఆక్రమించి వెంచర్ వేసిన వారిపై ఈ కేసు నమోదు చేయాలన్నారు. అలాగే గత వైసీపీ హయంలో మండలంలో భారీగా భూ అక్రమణలు జరిగాయని వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి నగల అపహరణ

ఏర్పేడు, డిసెంబరు 5: మండలంలోని రావిళ్లవారికండ్రిగలో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలో చొరబడి అమ్మవారి మెడలో ఉన్న సుమారు రెండు సవర్ల బంగారు నగలను అపహరించినట్టు పూజారి విజయభాస్కర్ ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యే వెంకటేష్‌కు సన్మానం

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కార్యక్రమాల నిర్వహణ కోఆర్డినేటర్‌గా సహాయ మంత్రి హోదాలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరం ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ నియమితులైన సందర్భంగా గురువారం ఆయన్ను ఎంజీఎం గ్రూప్స్ ఛైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు, మయూర్ ఘనంగా సన్మానించారు. సహాయమంత్రి హోదాలో నియమితులు కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం: ఏపీటీఎఫ్


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌పై విద్యార్థులు దాడి చేయడం అమానుషమని ఏపీటీఎఫ్ నాయకులు అన్నారు. గురువారం సరస్వతిబాయి పురపాలకసంఘ పాఠశాల వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపి ఆయన మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ... పతనమవుతున్న సంస్కృతిని గాడిలో పెట్టాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులను శిక్షించాలన్నారు. ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. వెంకటాద్రి, గోపాల్, సురేష్‌బాబు, హేమకుమార్, చంద్రశేఖర్, ప్రసాద్‌బాబు, దిలీప్, ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన సంతోష్ కుటుంబ సభ్యులు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. చెక్కును అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శ నానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు



శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని గురువారం టీటీడీ బోర్డు సభ్యుడు బి.మహేందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, జనసేన నాయకులు కావలి శివకుమార్, తోట గణేష్, జ్యోతిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రైల్వే యూనియన్ ఎన్నికలు

రేణిగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైల్వే యూనియన్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. రెండు రోజులపాటు కొనసాగిన ఈ ప్రక్రియ ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా జరిగింది. రైల్వే ఇనిస్టిట్యూట్, సీఆర్ఎస్‌లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజులకుగాను మొత్తం 97శాతం పోలింగ్ జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

వర్షంతో వరికి మేలు

పిచ్చాటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తుఫానుతో పడ్డ భారీ వర్షాల వల్ల వరికి మేలే జరిగిందని వ్యవసాయ అధికారి సంజీవ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌బీ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వరి ని ఆశించే చీడపీడలు, పురుగులు, తెగుళ్ల వల్ల కలిగే నష్టాలు వర్షంతో నివారణ జరి గిం దన్నారు. మంచు కురుస్తున్నందున అగ్గి తెగులు, బీఎల్‌బీ ఆశించే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు ఎకరాకు ఎర్ర పోటాష్ 20 కిలోలు చల్లుకోవాలన్నారు. తెగులు ఎక్కువగా ఉంటే ట్రైక్లోజల్, పూజ్జీవన్, కాసుగా మైసిన్ మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. ఆకులపై కంటి ఆకారంలో మచ్చలున్నా, గట్టు పక్కన నారు ఎండి పోయినా అగ్గి తెగులుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్ల నిర్మాణం వేగవంతం

పిచ్చాటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో 32 సిమెంటు రోడ్లకు నిధులు మంజూరయ్యాయని ఎంపీడీవో మహ్మద్ రఫి చెప్పారు. కాంట్రాక్టర్లకు ప్రతి గురువారం బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ఈక్రమంలో గురువారం మండలంలో జరుగుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. రామగిరి పంచాయతీలోని అడవికండ్రిగ బీసీ కాలనీ, వెంకటేష్ వీధుల్లో రూ.6 లక్షలతో జరిగిన రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ ఏడాది చివరికల్లా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పూర్తి చేసుకుంటే బిల్లులు త్వరితగతిన వస్తాయన్నారు. ప్రస్తుతం ఐదు కాలనీల్లో రోడ్లను నిర్మించారని మిగిలినవి కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.

వ్యవసాయ విస్తరణ అధికారిగా కవిత

వరదయ్యపాళెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖ విస్తరణ అధికారిగా కవిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో తొట్టంబేడు మండలం పూడి రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ సహాయకురాలిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బాధ్యతలు స్వీకరించారు.

తీరిన తాగునీటి సమస్య



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం దళితవాడలో తాగునీటి మోటరుకు మరమ్మతులు చేయించి గురువారం నీటిని అం దించారు. తుఫాన్ ప్రభావంతో దళితవాడలోని మోటరు కాలిపోవడంతో మూడు రోజులుగా తాగునీటికి దళితులు ఇబ్బంది పడ్డారు. స్పందించిన సర్పంచు మాచాలమ్మ మోటరుకు మరమ్మతులు చేయించారు.